క్లుప్తంగా

డెంగీతో అప్రమత్తంగా ఉండాలి



పులిచెర్లలో ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది

పులిచెర్ల(కల్లూరు): డెంగీతో అప్రమత్తంగా ఉండాలని పులిచెర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. ఆయన శుక్రవారం జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా వైద్య సిబ్బందితో కలిసి డెంగ్ జ్వరంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పరిసరాల్లో వర్షపు నీరు నిలువకుండా చూడాలన్నారు. దోమలు వృద్ధి చెంది జ్వరాలు ప్రబలే అవకాశం ఉందని, వాటి లార్వా చనిపోయేందుకు కాలువల్లో ఆయిల్ బాల్స్ వేయాలన్నారు. అధిక జ్వరం, తలనొప్పి, అలసట తదితర లక్షణాలు ఉంటే వెంటనే డాక్టరును సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో విద్యాసాగర్, శ్రీదేవి, చంద్రయ్య, ప్రమీల, పురుషోత్తం పాల్గొన్నారు.

విద్యార్థులకు హోమియో కిట్లు



డాక్టర్ శివను సన్మానిస్తున్న ప్రిన్సిపాల్ శ్రీనివాస్

పుంగనూరు: పట్టణంలోని శుభారాం ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు శుక్రవారం హోమియో వైద్యులు డాక్టర్ పి.శివ ఉచితంగా హోమియో మందుల కిట్లు పంపిణీ చేశారు. డాక్టర్ శివ మాట్లాడుతూ హోమియో మందులు వాడితే అనేక రోగాలు నయమవుతాయన్నారు. ఎలాంటి సైడ్ ఎఫెక్ట్స్ వుండవన్నారు. అనంతరం డాక్టర్‌ను ప్రిన్సిపాల్ శ్రీనివాస్, అధ్యాపకులు సన్మానించారు.

పాముకాటుతో యువకుడికి అస్వస్థత



పాముకాటుకు గురైన సతీష్

పుంగనూరు: మండలంలో రాంపల్లెలో శుక్రవారం పాముకాటుతో వ్యక్తి తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. కుటుంబ సభ్యుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన సతీష్(21) పొలం వద్ద ఉండగా పాముకాటు వేసింది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో పెద్దపంజాణి మండలం శివాడిలోవున్న ఆస్పత్రికి తరలించారు.

మల్లానూరు పీహెచ్‌సీ తనిఖీ

కుప్పం: మండలంలోని మల్లానూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం కుప్పం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ (కడా) ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్ తనిఖీ చేశారు. అక్కడ రోగులకు అందుతున్న వైద్య సదుపాయాలపై ఆరా తీశారు. కుప్పం నియోజకవర్గంలో టాటా గ్రూప్ సహకారంతో ఏర్పాటు చేసిన డిజిటల్ నెర్వో సెంటర్ పనితీరుపై అడిగి తెలుసుకున్నారు. అలాగే మల్లానూరు పంచాయతీలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్ మునిరత్నం, టీటీడీ పాలకమండలి సభ్యుడు శాంతారామ్ తదితరులు పాల్గొన్నారు.

వర్షంతో వేరుశనగకు ఊరట



చౌడేపల్లె: మండలంలోని పెద్దకొండామర్రి, చిన్నకొండామర్రి, కోటూరు, మొట్లపల్లె, బత్తలాపురం తదితర గ్రామాల్లో మొగలసల కార్తె రాక మునుపే ఖరీఫ్ సీజనులో కొందరు రైతులు వేరుశనగ విత్తనాలు వేశారు. వర్షం రాకపోవడంతో మొక్కలు ఎండుముఖం పట్టాయి. ఈ క్రమంలో నాలుగు రోజులుగా కురుస్తున్న మోస్తరు వర్షానికి ప్రాణం లేచివచ్చినట్టు అయింది. పొలాలన్నీ పచ్చగా మారాయి. రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

వైష్ణవి దేవి ఆలయంలో శ్రావణ మాసపు పూజలు



చౌడేపల్లె: మండలంలోని పుదిపట్ల సమీపంలో వున్న వైష్ణవీదేవి ఆలయంలో శ్రావణ మాసపు తొలి శుక్రవారాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని సౌందర్యలహరి పారాయణం చేశారు. కార్యక్రమానికి ఉభయదారులుగా గుంటూరుకు చెందిన శ్రీరామ్‌ప్రసాద్, అన్నపూర్ణ వ్యవహరించారు.

ఆటో డ్రైవర్‌ను చితకబాదిన వ్యాపారి

పుంగనూరు: సంతగేటు వద్ద శుక్రవారం అంగడి ముందు ఆటో నిలిపినందుకు యజమాని డ్రైవర్‌ను చితకబాదాడు. పోలీసుల కథనం మేరకు..డ్రైవర్ షాన్‌వాజ్(32)ఆటోలో ప్రయాణికులను ఎక్కించుకుని సంతగేటు వద్ద ఖాజాఫీర్ కూరగాయల షాపు ముందు నిలిపాడు. దీనిపై ఆగ్రహించిన వ్యాపారి అతనిపై దాడి చేశాడు. తల, కన్ను భాగంలో తీవ్రం గాయాలైన ఆటో డ్రైవర్‌ను స్థానికులు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యులు తిరుపతికి రెఫర్ చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆక్సిజన్ కనెక్షన్ ఎప్పుడిస్తారు సారూ..?

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం స్థానిక ఏరియా ఆస్పత్రిని వంద పడకలుగా మార్చింది. అందుకు తగిన వసతులు కల్పించేందుకు భవన నిర్మాణాన్ని సైతం చేపట్టింది. ఇంతలో ఎన్నికలు వచ్చి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఈ ఏడాది మార్చిలో నూతన భవనాన్ని ప్రారంభించింది. ప్రత్యేక వార్డు సౌకర్యాలు కల్పించాల్సి వున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. ముఖ్యంగా ఇన్‌పేషెంట్ల బెడ్లకు ఆక్సిజన్ కనెక్షన్ ఇవ్వలేదు. దీంతో రోగులు ఇబ్బంది పడుతున్నారు.

- ఆక్సిజన్ ప్లాంట్ ఉన్నా పనిచేయని ప్రెజర్ స్వింగ్ ఎడ్‌సోర్ప్షన్ (పీఎస్‌ఏ)
- పెండింగ్‌లోనే మేజర్, మైనర్ రిక్వైర్‌మెంట్స్ ప్రతిపాదనలు
- గత ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన కోవిడ్ వార్డే దిక్కు



పలమనేరు వంద పడకల ఏరియా ఆస్పత్రి



30 బెడ్లకు ఆక్సిజన్ అందించే ఎల్‌ఎంవో ట్యాంకు

పలమనేరు: పలమనేరు పట్టణంలోని ఏరియా ఆస్పత్రిని చూసిన వారు ఎవరైనా ఆశ్చర్యం వ్యక్తం చేయాల్సిందే. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నాడు–నేడు కింద రూ.16 కోట్లతో ఈ ఆస్పత్రిని అభివృద్ధి చేసింది. ఆస్పత్రి స్థాయిని వంద పడకలకు చేసింది. అంతేగాక ఏపీ మెడికల్ సర్వీసెస్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఎంఎస్ కేఎంవీ ప్రాజెక్ట్స్ లిమిటెడ్ కొత్త భవన నిర్మాణాన్ని చేపట్టింది. పాత ఆస్పత్రిలో ఐదు బ్లాకులు వుండగా కొత్త ఆస్పత్రిలో అదనంగా మరో ఐదు బ్లాకులు ఏర్పాటు చేశారు. 50 మందికి ఆక్సిజన్ అందించేలా ప్లాంట్‌ను ఏర్పాటుచేసింది. పనులు పూర్తయి ఈ ఏడాది మార్చి 7న కొత్త భవనాన్ని అధికారులు ప్రారంభించి వైద్య సేవలు అందుబాటులోకి తీసుకువచ్చారు. ఇంకా పలు పనులు చేపట్టాల్సి వున్నా ఆ దిశగా చర్యలు తీసుకోలేదు. ముఖ్యంగా 50 బెడ్లకు ఆక్సిజన్ అందించే పైపులైన్ అమర్చలేదు. ఆక్సిజన్ ప్లాంట్ ఉన్నా లైనింగ్ సౌకర్యాన్ని కల్పించలేదు. మరోవైపు గాలి ద్వారా ఆక్సిజన్‌ను తయారు చేసేందుకు పీఎస్‌ఏ(ప్రెజర్ స్వింగ్ ఎడ్‌సోర్ప్షన్) యంత్రం ఉన్నా వినియోగించడం లేదు. ప్రస్తుతం ఆక్సిజన్ సిలిండర్‌ను ఎల్‌ఎంవో ప్లాంట్‌లో నింపి దాని నుంచి బెడ్లలో వున్న పేషెంట్లకు ఆక్సిజన్ అందిస్తున్నారు.

వెంటనే రూ.45 లక్షలు కావాల్సిందే

కోవిడ్ మహమ్మారి ప్రపంచాన్ని వణించిన విషయం తెలిసిందే. ఆ సమయంలో గత ప్రభుత్వం పలమనేరు ఆస్పత్రిలో 30 బెడ్లతో కోవిడ్ వార్డును ఏర్పాటుచేసింది. ఎంతోమంది ప్రాణాలను కాపాడింది. ఇప్పుడు కరోనా లాంటి కొత్త వైరస్‌లు వచ్చే అవకాశం ఉందని ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో ఏరియా ఆస్పత్రి పూర్తిస్థాయిలో ఏర్పాట్లు లేవనే సమాధానం వినిపిస్తోంది. వైరస్‌ను గుర్తించేందుకు అవసరమైన టెస్టింగ్ ల్యాబ్‌లు లేవు. కొత్త ఆస్పత్రిలో ప్రత్యేక వార్డు సౌకర్యాలు కల్పించలేదు. కృత్రిమ శ్వాసను అందించేందుకు గత ప్రభుత్వం ఏర్పాటుచేసిన ఆక్సిజన్ ప్లాంట్ నుంచి పాత ఆస్పత్రిలోని ఐదు బెడ్లకు మాత్రమే ఆక్సిజన్ సౌకర్యం ఉంది. మిగిలిన 25 బెడ్లకు కనెక్షన్ ఇవ్వలేదు. మరోవైపు కొత్తగా నిర్మించిన బెడ్లలో ఇన్ పేషెంట్లకు సైతం ఆక్సిజన్ లైనింగ్ ఏర్పాటుచేయలేదు. గాలినుంచి ఆక్సిజన్‌ను ఇక్కడే తయారు చేసే యంత్రం రిపేరులో ఉందని, దీని మరమ్మతుల కోసం ఇటీవల రూ.45 లక్షల అంచనాలతో జిల్లా కలెక్టర్‌కు ప్రతిపాదనలు పంపినట్టు అధికారులు చెబుతున్నారు. తాజాగా కుప్పానికి వచ్చిన సీఎం చంద్రబాబు మాత్రం అన్ని ఆస్పత్రుల్లోనూ చైనా వైరస్‌ను ఎదుర్కొనేందుకు ప్రత్యేక బెడ్లు సిద్ధంగా ఉన్నాయని చెప్పడం కొసమెరుపు.



ఆక్సిజన్ యూనిట్, అందులో పనిచేయని యంత్రం

ఇప్పటికిప్పుడు భయంలేదు



కొత్త వైరస్ వస్తుందన్న ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో ఇప్పటికిప్పుడు భయపడాల్సిన పనిలేదు. గత ప్రభుత్వం ఏర్పాటు చేసినా ఆక్సిజన్ ప్లాంట్ నుంచి ఆక్సిజన్‌ను ఇన్ పేషెంట్లకు పెట్టేందుకు ఇంకా లైనింగ్ చేయలేదు. అదేవిధంగా ఇక్కడే ఆక్సిజన్ తయారు చేసే పరికరం వైరింగ్‌ను ఎలుకలు కట్ చేయడంతో అది పనిచేయడం లేదు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేశాం. అలాగే మేజర్, మైనర్ రిక్వైర్‌మెంట్స్ కోసం రూ.45 లక్షలు అవసరమని కలెక్టర్‌కు నివేదిక ఇచ్చాం.

–డాక్టర్ మమతారాణి, ఆస్పత్రి సూపరింటెండెంట్, పలమనేరు

భార్యపై భర్త దాడి

పుంగనూరు: మండలంలోని మరసనపల్లె గ్రామంలో శుక్రవారం కుటుంబ కలహాల నేపథ్యంలో భార్యను భర్త చితకబాదాడు. పోలీసుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన నరసింహులు, అతని భార్య భారతమ్మ (35) మధ్య ఇటీవల కుటుంబ కలహాలు నెలకొన్నాయి. ఈ క్రమంలో ఆగ్రహం వ్యక్తం చేసిన నరసింహులు భార్యను తీవ్రంగా కొట్టి గాయపరిచాడు. తీవ్రంగా గాయపడిన భారతమ్మను గ్రామస్తులు ఏరియా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పశువులకు ముందస్తు టీకాలు తప్పనిసరి



చంద్రశేఖర్

గుడుపల్లె: వర్షాకాలంలో పశువులను జాగ్రత్తగా చూసుకోవాలని పశువైద్యాధికారి చంద్రశేఖర్ తెలిపారు. ఆయన శుక్రవారం రైతులకు పలు సూచనలు చేశారు. ఆయన మాట్లాడుతూ వ్యాధులు రాకుండా పశువులకు ముందస్తు టీకాలు, నట్టల నివారణ మందులు వేయించాలన్నారు. వర్షాకాలంలో పశువులు తడవకుండా షెడ్లు ఏర్పాటుచేసుకోవాలని సూచించారు. పశువులు వ్యాధుల బారిన పడిన వెంటనే సమీపంలోని పశు వైద్యులను సంప్రదించాలన్నారు.

వైద్యుడు లేక.. వైద్యం అందక..

పుంగనూరు: పట్టణంలోని కొత్తపేట పీహెచ్‌సీలో వైద్యుడు లేకపోవడంతో వైద్యం అందక రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడికి ప్రతిరోజూ సుమారు 60 మందికి పైగా రోగులు వస్తుంటారు. ఇక్కడ పనిచేస్తున్న డాక్టర్ గత నెల ఉద్యోగ విరమణ చేశారు. ఆయన స్థానంలో కొత్త డాక్టర్‌ను నియమించలేదు. దీంతో ఆస్పత్రికి వచ్చే రోగులకు వైద్యం కరువైంది. ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లి చికిత్స చేయించుకోవడానికి ఆర్థిక స్థోమత లేక పేదలు ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి డాక్టర్‌ను నియమించి వైద్యం అందించాలని స్థానికులు కోరుతున్నారు.

అక్రమ కేసులకు భయపడేది లేదు

- ఎంపీ మిథున్‌రెడ్డి అరెస్టు అక్రమం
- నల్లబ్యాడ్జీలతో వైఎస్సార్ సీపీ శ్రేణుల నిరసన



నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతున్న వైఎస్సార్‌సీపీ నేతలు

చౌడేపల్లె: అక్రమ కేసులకు భయపడే ప్రసక్తే లేదని వైఎస్సార్ సీపీ నేతలు, కార్యకర్తలు స్పష్టం చేశారు. వారు శుక్రవారం నల్ల బ్యాడ్జీలు ధరించి రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి అక్రమ అరెస్ట్‌ను ఖండిస్తూ చౌడేపల్లె ప్రయివేటు బస్టాండు కూడలిలో ఉన్న దివంగత మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం ఎదుట నిరసన తెలిపారు. అనంతరం ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్.దామోదరరాజు, బోయకొండ ఆలయ మాజీ చైర్మన్ మిద్దింటి శంకర్ నారాయణ, మండల కన్వీనర్ నాగభూషణరెడ్డి, వైస్ ఎంపీపీ సుధాకర్‌రెడ్డి విలేకరులతో మాట్లాడారు. మద్యం విక్రయాల్లో ఎక్కడా అవినీతి జరగకపోయినా కూటమి ప్రభుత్వం వైఎస్సార్ సీపీ నేతలపై తప్పుడు కేసులు నమోదు చేసి అరెస్టు చేస్తోందన్నారు. గత ప్రభుత్వం మద్యం పాలసీ పారదర్శకంగా అమలుచేసిందన్నారు. ప్రభుత్వం ఆధ్వర్యంలోనే మద్యం షాపులను కొనసాగించిన విషయాన్ని గుర్తు చేశారు. లేని స్కామ్‌ను సృష్టించి వైఎస్సార్ సీపీ నేతలను లక్ష్యంగా చేసుకుని భయభ్రాంతులకు గురిచేస్తోందని దుయ్యబట్టారు. మద్యం కేసులో ఎంపీ మిథున్‌రెడ్డి కడిగిన ముత్యంలా బయటకు వస్తారని చెప్పారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేసే వరకు ప్రజల పక్షాన పోరాటం చేస్తామన్నారు. ప్రజలు అన్ని విషయాలను గమనిస్తున్నారని, రాబోయే రోజుల్లో తగిన విధంగా బుద్ధి చెబుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ నరసింహులు యాదవ్, మాజీ ఎంపీపీ అంజిబాబు, రుక్మిణమ్మ, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు కృష్ణారెడ్డి, నాయకులు మిద్దింటి కిషోర్‌బాబు, పద్మనాభరెడ్డి, చెంగారెడ్డి, వెంకటమణ, లడ్డూ రమణ, రమేష్ బాబు, మునికృష్ణమ నాయుడు, బీఎస్ రెడ్డి, కళ్యాణ్‌భరత్, శ్రీరాములు, లక్ష్మీనర్సయ్య, ఆల్తాఫ్, షంషీర్, బ్రహ్మానందరెడ్డి, వెంకటరెడ్డి, ఓబులేసు, శ్రీనివాసులు, గంగిరెడ్డి, జయచంద్ర, పవన్, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

యూవిన్ యాప్‌పై ఏఎన్‌ఎంలకు శిక్షణ



మాట్లాడుతున్న జిల్లా కోఆర్డినేటర్ శివ

పుంగనూరు: పట్టణంలోని అర్బన్ పీహెచ్‌సీలో శుక్రవారం డాక్టర్ రంజిత ఆధ్వర్యంలో ఏఎన్‌ఎంలకు యూ విన్ యాప్‌పై శిక్షణ ఇచ్చారు. జిల్లా కోఆర్డినేటర్ శివ మాట్లాడుతూ చిన్నపిల్లలు, గర్భిణులకు ఇచ్చే టీకాల వివరాలను యాప్‌లో నమోదు చేయాలని సూచించారు. వివరాలు ఎలా నమోదు చేయాలి, సర్టిఫికెట్లను ఎలా డౌన్‌లోడ్ చేయాలన్న దానిపై సిబ్బందికి అవగాహన కల్పించారు.

గంగమ్మకు శాస్త్రోక్తంగా రాహుకాల పూజలు



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు, బోయకొండలో భక్తుల రద్దీ

చౌడేపల్లె: ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండ గంగమ్మ ఆలయంలో శుక్రవారం రాహుకాల అభిషేకాలు, పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. శ్రావణ మాసపు తొలి శుక్రవారం కావడంతో అమ్మవారిని ప్రత్యేకంగా బంగారు ఆభరణాలు, పూలతో అలంకరించారు. మహిళలు ఉపవాస దీక్షలతో ఆలయం వద్దకు చేరుకుని పూజలు చేశారు. రాహుకాల అభిషేక పూజల్లో పాల్గొన్న ఉభయదారులకు అధికారులు, వేద పండితులు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయం ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తులతో కిటకిటలాడింది.

సచివాలయ సిబ్బందికి సన్మానం



సచివాలయ సిబ్బందిని సన్మానిస్తున్న సర్పంచ్

చౌడేపల్లె: మండలంలోని దుర్గసముద్రం సచివాలయం నుంచి బదిలీ అయిన సిబ్బందిని శుక్రవారం సర్పంచ్ సరస్వతమ్మ, గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. డిజిటల్ అసిస్టెంట్ నందకుమార్, వెల్ఫేర్ అసిస్టెంట్ వంశీకృష్ణ, మహిళా పోలీస్ పద్మశ్రీ, ఏఎన్‌ఎం సునీత సచివాలయంలో ఐదేళ్లు విశిష్ట సేవలు అందించారని కొనియాడారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సుభాషిణి, విశ్రాంత వీడీవో కృష్ణారెడ్డి, గ్రామస్తులు చెంగారెడ్డి, కృష్ణంరాజు, ప్రభాకర్‌రెడ్డి, అమరనాథ్, సనావుల్లా, రత్నయ్య తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన చౌడేశ్వరిదేవి జయంతి ఉత్సవాలు



ప్రత్యేక అలంకరణలో చాముండేశ్వరిదేవి

పుంగనూరు: పట్టణంలోని తూర్పుమొగసాలలో వెలసిన చాముండేశ్వరిదేవి ఆలయంలో జెట్టికులస్తులు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జయంతి ఉత్సవాలు శుక్రవారం ముగిశాయి. ఇందులో భాగంగా అమ్మవారికి పవిత్ర నదీ జలాలతో అభిషేకించారు. వివిధ రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని చలిపిండి దీపాలు వెలిగించి, చల్లముద్ద పెట్టి మొక్కులు చెల్లించారు.

సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని వినతి

పలమనేరు: పలమనేరు పట్టణంలో ఎన్నో ఏళ్లు జరుగుతున్న వారపు ఎద్దుల సంత వివరాలను తెలియజేస్తూ సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని బీజేపీ నాయకులు కోరారు. వారు శుక్రవారం మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డికి వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ గతంలో పట్టణంలోని మార్కెట్ కమిటీలో ఎద్దుల సంత జరిగేదన్నారు. రైతులు, వ్యాపారులు అక్కడ పశువులను కొనుగోలు చేసేవారని తెలిపారు. మార్కెటింగ్ శాఖ అధికారులు సంతను పలమనేరు సమీపంలోని క్యాటిల్‌ఫామ్ వద్దకు మార్చారని తెలిపారు. అక్కడికి ఎలా వెళ్లాలో తెలియక రైతులు, వ్యాపారులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో గుడియాత్తం రోడ్డు, బంగారుపాళెం, పుంగనూరు రోడ్డు వద్ద పశువుల సంత మార్గాన్ని సూచిస్తూ బోర్డులు ఏర్పాటు చేయాలని కోరారు. శరవణ, వంశీకృష్ణ, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

పెద్దకర్మకు ఆర్థిక సాయం

పలమనేరు: హైదరాబాద్‌లోని షంషాబాద్‌కు చెందిన ప్రసాద్ భార్య రామేశ్వరి పదిరోజుల క్రితం మృతిచెందింది. పెద్ద కర్మ చేయడానికి స్థోమత లేక రామేశ్వరి కుటుంబ సభ్యులు ఇబ్బంది పడుతున్నట్టు సర్వీస్ టు సొసైటీ సంస్థ సభ్యులు లక్ష్మీ, బాబు, శశిరేఖ, కిరణ్ గాయత్రి తెలుసుకున్నారు. వారి వినతి మేరకు పలమనేరు మండలం మొరం గ్రామానికి చెందిన అశోక్ శుక్రవారం కొంత ఆర్థిక సాయం అందజేశారు.

అమ్మవారి సేవలో ఏఎస్పీ



బోయకొండ ఆలయం వద్ద ఏఎస్పీ రాజశేఖర్‌రాజు

చౌడేపల్లె: బోయకొండ గంగమ్మను శుక్రవారం చిత్తూరు ఏఎస్పీ (ఓఎస్డీ) రాజశేఖర్‌రాజు దర్శించుకున్నారు. ఆలయం వద్దకు చేరుకున్న ఆయనకు ఈవో ఏకాంబరం స్వాగతం పలికి అమ్మవారి దర్శనం కల్పించారు. ఏఎస్పీ ప్రత్యేక పూజలు చేయించి మొక్కులు చెల్లించారు. ఏఎస్పీ మాట్లాడుతూ 1975లో తాను అమ్మవారిని దర్శించుకున్నానని, నాటికి నేటికి ఆలయం ఎంతో అభివృద్ధి చెందిందని వివరించారు. ఆయన వెంట ఎస్‌ఐ నాగేశ్వరరావు ఉన్నారు.

మోదీ ఏడాది పాలనపై బీజేపీ సంబరాలు

పుంగనూరు: ప్రధాని నరేంద్రమోదీ ఏడాది పాలన పూర్తయిన సందర్భంగా బీజేపీ నేతలు శుక్రవారం స్థానిక గోకుల్ సర్కిల్‌లో సంబరాలు జరుపుకున్నారు. ప్రజలకు మిఠాయిలు పంపిణీ చేశారు. మోదీ పాలనలో దేశం సుభిక్షంగా ఉందని కొనియాడారు. నానబాలకుమార్, టీవీఎస్ ప్రసాద్, జగదీష్‌రాజు, మల్లికారాణి, మణి, కుట్టి, చంద్రశేఖర్‌రాజు పాల్గొన్నారు.

తాగునీటి సరఫరాలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు



పంప్‌హౌస్‌ను తనిఖీ చేస్తున్న కమిషనర్

పలమనేరు: అంటువ్యాధులు సోకుతున్న తరుణంలో మంచినీటి సరఫరాలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి హెచ్చరించారు. ఆయన శుక్రవారం పట్టణ సమీపంలోని నాగమంగళం పంప్ హౌస్‌ను తనిఖీ చేశారు. సిబ్బందితో మాట్లాడి బోర్లలో నీటి లభ్యత తదితర వివరాలు తెలుసుకున్నారు. ఎప్పటికప్పుడు పట్టణంలోని ట్యాంకుల్లో క్లోరినేషన్ చేయాలని, పైపు లీకేజీలు లేకుండా చూడాలని ఆదేశించారు. పంప్ హౌస్ వద్ద ఇసుకాసురులు ఇసుక తవ్వుతున్నా సిబ్బంది పట్టించుకోకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

లోపాల గుర్తింపునకే నమూనాల సేకరణ



ఎరువుల దుకాణంలో నమూనాలు సేకరిస్తున్న ఏవో మోహన్‌కుమార్

చౌడేపల్లె: రసాయనిక ఎరువుల్లో లోపాలను గుర్తించడానికే నమూనాలు సేకరిస్తున్నట్టు వ్యవసాయాధికారి మోహన్‌కుమార్ తెలిపారు. ఆయన శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయానికి ఎదురుగా ఉన్న ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా 20–20–0–13 రకం కాంప్లెక్స్ ఎరువు నమూనాలు సేకరించారు. ఆయన మాట్లాడుతూ ఈ బస్తాలో నత్రజని, భాస్వరం, సల్ఫర్ ఒక్కొక్కటి 20 శాతం చొప్పున, పొటాష్ 0 శాతం చొప్పున ఉండాలని తెలిపారు. నమూనాలను మూడు పరిశోధన కేంద్రాలకు పంపనున్నట్టు చెప్పారు. అక్కడి నుంచి వచ్చే నివేదికల ఆధారంగా లోపాలను గుర్తించి తగిన చర్యలు తీసుకోనున్నట్లు వివరించారు. ఎరువులను రైతులకు ఎంఆర్పీ ధరలకే విక్రయించాలని డీలర్లకు సూచించారు.యూరియా కృత్రిమ కొరత సృష్టించి అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట అగ్రికల్చర్ అసిస్టెంట్ నవీన్‌కుమార్ ఉన్నారు.

రోడ్డులో గుంతలు పూడ్చండి సారూ..!



ఎరుకులపురం వద్ద గుంతలమయమైన రోడ్డు

సదుం: మండలంలోని భట్టువారిపల్లె వద్ద సదుం–కల్లూరు ప్రధాన రహదారిలో పెద్ద పెద్ద గుంతలు పడ్డాయి. వర్షం వస్తే గుంతల్లో నీరు నిలిచి వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. గుంతలు పూడ్చాలని పలుమార్లు అధికారులను కోరినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే రోడ్లను బాగు చేస్తామని కూటమి నేతలు ఎన్నికల్లో గొప్పలు చెప్పారని, అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయినా రోడ్లను బాగుచేయలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గుంతలు పూడ్చాలని, రోడ్లను బాగు చేయాలని కోరుతున్నారు.

ప్రజా సమస్యలపై ఉద్యమాలు



మాట్లాడుతున్న నాగరాజు, జనార్దన్

పుంగనూరు: ప్రజా సమస్యలపై ఉద్యమిస్తామని సీపీఐ జిల్లా కార్యదర్శి నాగరాజు, సహాయ కార్యదర్శి జనార్దన్ తెలిపారు. వారు శుక్రవారం స్థానిక అంబేడ్కర్ భవనంలో పార్టీ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ పార్టీ 100 సంవత్సరాల వేడుకలను గ్రామ స్థాయి నుంచి పట్టణ స్థాయి వరకు నిర్వహించి, సాధించిన విజయాలు, చేపట్టనున్న పోరాటాలను ప్రజలకు వివరిస్తామన్నారు. అలాగే పట్టణంలో 100 పార్టీ జెండాలను ఆవిష్కరిస్తామని వెల్లడించారు. విద్యుత్ చార్జీల పెంపు, పేదలకు 2 సెంట్ల భూమి కేటాయించాలని, ఇళ్ల నిర్మాణానికి రూ.5 లక్షలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఆగస్టు 9, 10 తేదీల్లో చిత్తూరులో సీపీఐ మహాసభలు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో పట్టణ నేతలు మున్న, కృష్ణ, వెంకట్రమణారెడ్డి, రత్నమ్మ తదితరులు పాల్గొన్నారు.